# సిజిహెచ్ఎస్ తరహాలోనే ఈహెచ్ఎస్ కంట్రిబ్యూషన్ వసూలు చేయాలి

**టాప్రా హనుమకొండ జిల్లా విస్తృత కమిటీ సమావేశంలో డిమాండ్**




**హనుమకొండ, జూలై 21 (ప్రజామంటలు)**:రాష్ట్ర ప్రభుత్వం ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ ప్యాకేజీ రేట్లనే అమలు చేస్తున్నప్పుడు, పెన్షనర్లు మరియు ఉద్యోగుల నుండి 1.5 శాతం వేతనం కట్ చేయకుండా కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం కంట్రిబ్యూషన్ రేట్లనే వసూలు చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ ౘ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ (టాప్రా) హనుమకొండ జిల్లా గౌరవాధ్యక్షులు సముద్రాల రామనరసింహాచార్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ టీచర్స్ కాలనీ కమ్యూనిటీ హాల్లో తూపురాణి సీతారాం అధ్యక్షతన టాప్రా జిల్లా విస్తృత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రామ నరసింహాచార్యులు మాట్లాడుతూ... సిజిహెచ్ఎస్ పరిధిలో ఉద్యోగులను, పెన్షనర్లను 12 కంటే ఎక్కువ గ్రూపులుగా విభజించి1 నుండి 5 గ్రూపులకు 250/-, 6వ గ్రూపుకు 450/-, 7 నుండి 11 గ్రూపులకు: ?650/-12 లేదా అంతకంటే ఎక్కువ గ్రూపులకు: 1,000/-మాత్రమే కంట్రిబ్యూషన్‌గా తీసుకుంటున్నారని తెలిపారు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం 1.5 శాతం కట్ చేయడం సముచితం కాదన్నారు. తెలంగాణ మొదటి పిఆర్సి కూడా 1 శాతం కంట్రిబ్యూషన్‌తో నాణ్యమైన వైద్యం అందించాలని సిఫార్సు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. గతంలో వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, కేసీఆర్ పాలనలో లేని ఈ భారాన్ని ప్రస్తుత ప్రభుత్వం విధించడం అన్యాయమని, వెంటనే సిజిహెచ్ఎస్ రేట్లను లేదా మొదటి పిఆర్సి సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానాలు వెంటనే పీఆర్సీ రిపోర్టు తెప్పించి, 45% ఫిట్‌మెంట్‌తో 01 జూలై 23 నుండి మానిటరీ బెనిఫిట్ వర్తించేలా ప్రకటన చేయాలి. పెండింగ్‌లో ఉన్న 6 డిఏ/డిఆర్ లను తక్షణమే విడుదల చేయాలి. ఎంపానెల్డ్ ఆసుపత్రుల యాజమాన్యాలతో ఒప్పందాలు పూర్తి చేసుకుని, ఉచిత మరియు నాణ్యమైన వైద్యాన్ని అందించాలి. ఈ కార్యక్రమంలో టాప్రా సంఘం ప్రతినిధులు, సభ్యులు, ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దేవాదుల నార్త్ కెనాల్‌కు వెంటనే నీళ్లు విడుదల చేసి రైతులను ఆదుకోవాలి

**మంత్రి పొన్నం ప్రభాకర్ కి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్ విజ్ఞప్తి**



**భీమదేవరపల్లి జూలై 21:**హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల పరిధిలోని వ్యవసాయ భూములకు సాగునీరందించేందుకు దేవాదుల ఎత్తిపోతల పథకం నార్త్ కెనాల్ ద్వారా వెంటనే నీటిని విడుదల చేయాలని బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ... ప్రస్తుత వానాకాలం సీజన్‌లో నీరు లేక ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లోని పంట పొలాలు ఎండిపోయే ప్రమాదంలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నార్త్ కెనాల్ ద్వారా సాగునీటిని పూర్తిస్థాయిలో విడుదల చేస్తేనే స్థానిక రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, పంటలను కాపాడుకోగలుగుతారని తెలిపారు.దేవాదుల నార్త్ కెనాల్ పరిధిలోని ఆయకట్టుకు తక్షణమే సాగునీరందించి, రైతులను ఆదుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కు సిపిఐ తరపున విజ్ఞప్తి చేశారు. మంత్రి వెంటనే స్పందించి తక్షణమే నీటి విడుదల ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

## నేడు మండలం లో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటన



**భీమదేవరపల్లి జూలై 21 :** తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ నేడు మండలం లో పరిధిలో పలు అధికారిక, రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.ఉదయం 06:00 గంటలకు భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో మార్నింగ్ వాక్.అనంతరం రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు.ఉదయం 09:00 గంటలకు ములకనూర్ లోని శ్రీ సాయి గార్డెన్‌లో సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పై బి.ఎల్.ఏ లు, బి.ఎల్.ఏ సూపర్‌వైజర్లతో సమీక్షా సమావేశం.ఉదయం 11:30 గంటలకు భీమదేవరపల్లి మండలం వంగరలోని మాజీ ప్రధాని శ్రీ పి.వి. నరసింహారావు స్మృతి వనం పరిశీలన చేయనున్నారు.

# నీట్ పేపర్ లీకేజీ దోషులను శిక్షించాలి

**కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి**

**ఢిల్లీలో విద్యార్థులు, యువకులపై పోలీసుల లాఠీ చార్జిని ఖండించాలి**

**జగిత్యాలలో వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన**




**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు ) జూలై 21:** జగిత్యాల జిల్లా కేంద్రంలో వామపక్ష పార్టీల నాయకులు బగ్గుమన్నారు. నీట్ పేపర్ లీకేజీ, 20 మంది విద్యార్థుల ఆత్మహత్యలకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కారణమని ఆరోపిస్తూ నిరసన కార్యక్రమాన్ని చేబట్టారు. తక్షణమే కేంద్రమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా నాయకులు జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహాశీల్దార్ చౌరస్తాలో గంటకు పైగా నిరసన చేపట్టారు. రాజ్యాంగబద్ధమైన హక్కులను వినియోగించుకుంటూ ఢిల్లీలో విద్యార్థులు, యువకులు నిరసన తెలుపుతున్న వారిపై పోలీసుల చేసిన లాఠీచార్జిని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు లెల్లల బాలకృష్ణ, సీపీఐ ఎంఎల్ న్యూ డేమాక్రసి నాయకుడు చింత భూమేశ్వర్, సీపీఐఎమ్ సీనియర్ నాయకుడు భూతం సారంగపాణి తదితరులు మాట్లాడుతూ దేశ యువత పై మోడీ సర్కార్ కాల్పులు, టియర్ గ్యాస్ తో వేలాది మందిని గాయపర్చిన ఘటన కు నైతిక బాధ్యత వహిస్తూ మోడీ ప్రధాని పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 22 లక్షల మంది విద్యార్థులు రాసిన నీట్ పేపర్ లీక్, 24మంది విద్యార్థులు ఆత్మహత్యకు కారణమైన కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ చలో పార్లమెంట్ నిరసన కార్యక్రమాలు చేబడితే యువతపై విచక్షణా రహితంగా లాఠీ చార్జ్ , టియర్ గ్యాస్ రబ్బర్ బుల్లెట్లతో గాయపరచడం అన్యాయమన్నారు. వేలాదిమందిని అరెస్టు చేసి వారి భావోద్వేగాలతో ఆడుకుంటున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాల్పులకు బాధ్యత వహిస్తూ భారత ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని మరోసారి డిమాండ్ చేశారు. తెలంగాణ నుండి ఎన్నికైన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లకు నీట్ పేపర్ లీక్ కారణంగా అనేకమంది విద్యార్థులు మృతి చెందడం కళ్లకు కనబడడం లేదా అని ప్రశ్నించారు. పర్యావరణ కార్యకర్త, విద్యావేత్త సోనం వాగు చుక్ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 24 రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేపట్టినా కేంద్ర ప్రభుత్వం స్పందించక పోవడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరికి నిదర్శనం ఢిల్లీలో విద్యార్థుల పై జరిగిన లాఠీ చార్జీ అని పేర్కొన్నారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించాలని, లేనిపక్షంలో రాబోయే రోజుల్లో తీవ్రమైన పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు కుంచం శంకర్, సుతారి రాములు. రాజన్న శ్రీగాద దేవదాసు, వెన్న మహేష్, అక్రమ్ , హనుమంతు, కొక్కుల శాంత, నామని లక్ష్మీ, గంగాధర్, జమాతే ఇస్లామిక్ ఇలియాస్ ఖాన్ , నరసయ్య , సుజాత, వడ్లకొండ శ్రీనివాస్, భూమయ్య , ఎండి ఉస్మాన్, కిరణ్ , రాజన్న , వెన్న మహేష్, సుజాత, పద్మ, గంగరాజం, ఎండి సమీర్ ,పిట్టల నారాయణ తదితరులు పాల్గొన్నారు

# శేకల్ల బీఎల్‌ఓలకు మంత్రి అడ్లూరి ఘన సత్కారం



**బుగ్గారం / జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు ) జూలై 21:** జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలో ఒక అద్భుతమైన కార్యక్రమం జరిగింది. భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని శేఖల్ల బి.ఎల్.ఓ.లు నిర్దేశిత గడువులోగా పూర్తి చేశారు. శేకల్ల గ్రామ బీఎల్ఓలు పర్స తబిత, జక్క శ్రీదేవి ల సేవలను అభినందిస్తూ...తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళ వారం శాలువాలతో ఘనంగా సత్కరించారు.వారి అంకితభావం, అద్భుతమైన కృషిని మంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. విధి నిర్వహణలో శేకల్ల బీఎల్ఓలు చూపిన చొరవ అందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీవో బింగి సురేష్, డిప్యూటీ తహసీల్దార్ మండలోజు రాకేష్ కుమార్, సర్పంచ్ పర్ష రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఉచిత వైద్య శిబిరం

**భోలక్‌పూర్‌లో 'అనుశ్రీ హాస్పిటల్స్' ఉచిత హెల్త్ క్యాంప్**




**సికింద్రాబాద్, జూలై 21 (ప్రజా మంటలు):** ప్రజల ఆరోగ్యం, మహిళల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అనుశ్రీ అఫోర్డబుల్ ఫెర్టిలిటీ, మెటర్నిటీ అండ్ లాప్రోస్కోపిక్ సెంటర్ (అనుశ్రీ హాస్పిటల్స్) ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. జూలై 22 బుధవారం ఉదయం 8:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు ముషీరాబాద్ పరిధిలోని భోలక్‌పూర్ వద్దగల కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఆవరణలో ఈ ప్రత్యేక ఆరోగ్య శిబిరం జరగనుంది.ఈ శిబిరానికి విచ్చేసే బాధితులకు మరియు స్థానికులకు రక్తపోటు (ద్బీ), ర్యాండమ్ బ్లడ్ షుగర్ (+=దీూ) మరియు బరువు (ఔవఅస్త్రష్ట్) తనిఖీలను ఉచితంగా నిర్వహించనున్నారు. నిపుణులైన వైద్య బృందం అందుబాటులో ఉండి మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక అవగాహన కల్పించడంతో పాటు తగిన సలహాలు అందించనున్నారు. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి సరైన చికిత్స తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చని వైద్యులు తెలిపారు.పద్మారావు నగర్ మెయిన్ రోడ్డులోని అనుశ్రీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉచిత వైద్య శిబిరాన్ని భోలక్‌పూర్, ముషీరాబాద్ పరిసర ప్రాంత ప్రజలంతా వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ ఆరోగ్య శిబిరానికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం బ9888 318 218బ ఫోన్ నంబర్‌ను సంప్రదించవచ్చని తెలియజేశారు.

# రెనోవా బిబి క్యాన్సర్ హాస్పిటల్స్‌లో

**అత్యాధునిక బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్, సెల్యులార్ థెరపీ సేవలు**



**సికింద్రాబాద్,జూలై 21 (ప్రజామంటలు):**బ్లడ్ క్యాన్సర్లు, క్లిష్టమైన రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులు మరియు పెద్దలకు అత్యుత్తమ వైద్యం అందించేందుకు హైదరాబాద్ మలక్‌పేట్‌లోని రెనోవా బిబి క్యాన్సర్ హాస్పిటల్స్‌లో అత్యాధునిక బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ (బీఎమ్‌టీ), సెల్యులార్ థెరపీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఈ చికిత్సలను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మరియు పొరుగు రాష్ట్రాల రోగులకు అందుబాటు ధరల్లో అందించడమే తమ లక్ష్యమని ఆసుపత్రి యాజమాన్యం మంగళవారం స్పష్టం చేసింది.ఈ సందర్భంగా సీనియర్ కన్సల్టెంట్లు డాక్టర్ ఎం.డి. నదీమ్ అహ్మద్, డాక్టర్ విషాల్ టోకా మీడియాతో మాట్లాడుతూ.. బ్లడ్ క్యాన్సర్లను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా మెరుగైన ఫలితాలు పొందవచ్చని తెలిపారు. ఇక్కడ విప్లవాత్మక 'కార్-టి' సెల్ థెరపీతో పాటు ఆటోలాగస్, అల్లోజెనిక్, హాప్లోఐడెంటికల్ వంటి బీఎమ్‌టీ చికిత్సలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే లుకేమియా, లింఫోమా, థలసేమియా, సికిల్ సెల్ అనీమియా వంటి తీవ్రమైన వ్యాధులకు ఇక్కడ సమగ్ర వైద్యం అందిస్తున్నట్లు వివరించారు.రోగులకు ఇన్‌ఫెక్షన్లు సోకకుండా హెపా ఫిల్టర్ సౌకర్యంతో కూడిన అత్యంత సురక్షితమైన, క్రిమిరహిత ప్రత్యేక గదులను ఏర్పాటు చేసినట్లు మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సయ్యద్ అక్బర్ కోత్వాల్, సీఓఓ ప్రొఫెసర్ మహ్మద్ మసూద్ అహ్మద్ తెలిపారు. నాణ్యమైన, అంతర్జాతీయ స్థాయి క్యాన్సర్ వైద్యాన్ని సామాన్యులకు సైతం అందుబాటులోకి తెచ్చేందుకు నిపుణులైన వైద్య బృందంతో విశేష కృషి చేస్తున్నామని వారు వెల్లడించారు.

# పాము కాటుతో బాలుడు లోకేష్ మృతి



**గొల్లపల్లి జులై 21ప్రజా మంటలు :** ధర్మపురి పట్టణం లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి కాలనీకి చెందిన ముస్కు లోకేష్ సం 4 ప్రస్తుతం ధర్మపురిలో ఒక ప్రైవేటు పాఠశాలలో యూకేజీ చదువుతున్నాడు మంగళవారం ఉదయం లోకేష్ తన ఇంటి సమీపంలో మూత్ర విసర్జన చేస్తున్న సమయంలో ఒక విషపూరితమైన పాము కాటు వేయగా వెంటనే బాలుని తాతయ్య చూసి వెంటనే లోకేష్ ని ధర్మపురి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు బాలుని తల్లి రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టుఎస్ఐ, జి మహేష్ తెలిపారు

# ముల్కనూర్‌లో పేకాట శిబిరంపై పోలీసుల దాడి

**నలుగురు అరెస్ట్.. రూ.1,480 నగదు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం**



**భీమదేవరపల్లి జూలై 21 (ప్రజా మంటలు):**హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం ముల్కనూర్ పోలీసులు దాడి చేయగా, ఐదుగురు పేకాట ఆడుతున్నట్లు గుర్తించారు.పోలీసులను గమనించిన మాడుగుల అలెగ్జాండర్ పరారయ్యాడు. మిగిలిన నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టైన వారిని మాడుగుల ప్రసాద్, మాడుగుల కృష్ణ, గునుకుంట్ల రాజయ్య, మాడుగుల బిషప్‌గా గుర్తించారు.వారి వద్ద నుంచి రూ.1,480 నగదు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. పరారీలో ఉన్న అలెగ్జాండర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

# వివాహితను బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు



**భీమదేవరపల్లి, జూలై 21 (ప్రజా మంటలు):**ఓ వివాహితను అసభ్యకరంగా ప్రవర్తిస్తూ బెదిరించిన ఘటనలో హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ గ్రామానికి చెందిన పెదవేనా హరికృష్ణపై ముల్కనూర్ పోలీసులు కేసు నమోదు చేశారు.పోలీసుల వివరాల ప్రకారం.. నిందితుడు హరికృష్ణ బాధితురాలితో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ఓయో గదికి రావాలని ఒత్తిడి చేసినట్లు తెలిపారు. తన మాట వినకపోతే ఆమెను, ఆమె కుమారుడిని చంపుతానని బెదిరించినట్లు పోలీసులు పేర్కొన్నారు.బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు చర్యలు చేపట్టినట్లు ముల్కనూర్ ఎస్సై రాజు తెలిపారు. మహిళలపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

# ఉద్యమకారుల గుర్తింపులో ఆలస్యం వద్దు: కవిత



**హైదరాబాద్, జూలై 21 (ప్రజా మంటలు):** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీకి తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత నివేదిక అందజేశారు. ఉద్యమకారులకు న్యాయం చేయడంలో ఆలస్యం చేయవద్దని కోరారు.స్వతంత్రత సైనిక్ సమ్మాన్ యోజన, హైదరాబాద్ లిబరేషన్ మూమెంట్ నిబంధనలను అధ్యయనం చేసి తెలంగాణ ఉద్యమకారులకు కూడా ప్రయోజనాలు కల్పించాలని సూచించారు. జైలుకు వెళ్లినవారు, ఎఫ్ఐఆర్‌లు ఎదుర్కొన్నవారు, పోలీస్ దాడులకు గురైనవారు, ఉద్యోగాలు కోల్పోయినవారు, మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.ఉద్యమకారుల కుటుంబాలకు ప్రయోజనాలు కల్పించడంతో పాటు జార్ఖండ్ తరహాలో గుర్తింపు కార్డులు, శాశ్వత కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. "కేకే కమిటీ అంటే కాలయాపన కమిటీ అనే భావన ఉంది. అది తప్పని నిరూపించాలి. కాలపరిమితిలో ఉద్యమకారులను గుర్తించి న్యాయం చేయాలి" అని కవిత అన్నారు.

# ఈనెల 23 నుంచి శ్రీ సాయి సప్తహ ఉత్సవాలు

**29న గురుపూర్ణిమ మహోత్సవం**



**సికింద్రాబాద్, జూలై 21 ( ప్రజామంటలు):**సికింద్రాబాద్ పద్మారావు నగర్‌లోని శ్రీ సాయి కుమార్ వ్యాధి నివారణ ఆశ్రమంలో శ్రీ సాయి సప్తహ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ ఏడాది జూలై 23వ తేదీ గురువారం నుండి జూలై 29వ తేదీ బుధవారం వరకు వారం రోజుల పాటు ఈ ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. ఆశ్రమ వ్యవస్థాపకులు, పూజ్య సద్గురు శ్రీశ్రీశ్రీ సాయికుమార్ గారి దివ్య సమక్షంలో ఈ ఆధ్యాత్మిక వేడుకలు జరగనున్నాయి.వారం రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలుఈ సప్తహ ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు విశేష పూజలు, అభిషేకాలను ఏర్పాటు చేశారు. జూలై 23న శ్రీ సాయి స్వర్ణాభిషేకం, శ్రీ సాయి విఘ్నేశ్వర విభూతి సేవలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. జూలై 24న శ్రీ సాయి అష్టలక్ష్మి సేవ, శ్రీ సాయి విష్ణు సహస్రనామ సేవలు నిర్వహిస్తారు. జూలై 25న శ్రీ సాయి పంచముఖ ఆంజనేయ సేవతో పాటు శ్రీ లక్ష్మీనారాయణ కళ్యాణాన్ని వైభవంగా జరిపించనున్నారు.జూలై 26న శ్రీ సాయి పంచఫలరసాభిషేకం, సామూహిక సాయి వ్రతాలు ఉంటాయి. జూలై 27న శ్రీ సాయి నరసింహస్వామి సేవ, శ్రీ సాయి రుద్రసేవలు, అలాగే జూలై 28న శ్రీ సాయి ధన్వంతరి సేవను భక్తుల సమక్షంలో నిర్వహించనున్నారు.29న వైభవంగా గురుపూర్ణిమ వేడుకలుఉత్సవాల ముగింపు రోజైన జూలై 29వ తేదీ బుధవారం నాడు గురుపూర్ణిమ మహోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటలకు శ్రీ సాయి కుంభాభిషేకం, ఉదయం 10:30 గంటలకు మహా మృత్యుంజయ హోమం జరుగుతాయి. అనంతరం సాయంత్రం 5 గంటల నుండి పూజ్య సద్గురు శ్రీశ్రీశ్రీ సాయికుమార్ గారిచే వ్యాసపూజ, దివ్య సందేశం (ప్రవచనం) ఉంటాయి. ఈ కార్యక్రమం అనంతరం భక్తులచే సుమధుర భజనలు, సద్గురు దర్శనం మరియు తీర్థప్రసాద వితరణ ఉంటాయని ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకై భక్తులు 040-27500127 లేదా 7386200127 నంబర్లను సంప్రదించవచ్చు.

# కొరుట్ల బస్‌స్టాండ్‌లో ఆర్టీసీ బస్సు చోరీ

**చాకచక్యంగా బస్సును తీసుకెళ్లిన దుండగుడు**

**వెంటాడి పట్టుకున్న పోలీసులు**



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు) జూలై 21:**జగిత్యాల జిల్లా కొరుట్ల పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్ ప్రాంగణంలో మంగళవారం సంచలన ఘటన చోటుచేసుకుంది. డిపో ముందు ఖాళీ స్థలంలో నిలిపి ఉంచిన ఆర్టీసీ బస్సును ఓ దుండగుడు చాకచక్యంగా తీసుకెళ్లినట్లు సమాచారం.డ్రైవర్, కండక్టర్ విధులకు వచ్చి చూడగా బస్సు కనిపించకపోవడంతో వెంటనే కొరుట్ల -- మెట్‌పల్లి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు అప్రమత్తమై ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు.పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి, వేగవంతమైన చర్యలు చేపట్టారు. బస్సును తీసుకెళ్లిన వ్యక్తి పోలీసులను చూసి బస్సు నిలిపివేసి దూకి పారి పోయే ప్రయత్నం చేశాడు. గండిమాన్ దేవాలయం సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం బస్సును స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. నిందితుడు ఎవరు, ఏ ఉద్దేశంతో బస్సును తీసుకెళ్లాడనే విషయాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

